పిడుగుపాటుకు నలుగురి మృతి

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబర్ 24: తెలంగాణ వ్యాప్తంగా మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పలుచోట్ల పిడుగులు పడి నలుగురు మృత్యువాతపడగా.. పలువురు గాయపడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం కురువగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ వర్షం పడింది. ఖమ్మం నగరంలోని ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో పిడుగుపడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం జగ్గారం శివారు బూరుగుగుంపునకు చెందిన కూలీలు కట్టం నాగశ్రీ (22), సున్నం అనూష (23) మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బత్తులపల్లికి చెందిన లక్ష్మయ్య (65) పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లిలో సోమవారం రాత్రి పిడుగుపడి ఎర్రబొజ్జు రాధిక ఇల్లు ధ్వంసమైంది. ఇంట్లో వారు ఊరికి వెళ్లడంతో ప్రాణనష్టం జరగలేదు. సింగూరు ప్రాజెక్టు నుంచి వరద వస్తుండటంతో మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది. దీంతో ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయాన్ని అధికారులు మూసివేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేటలో పిడుగుపడి పశువుల కాపరి కృష్ణకుమార్ (30) మృతి చెందాడు. వారం రోజులుగా వానలు లేక బీటలు వారుతున్న వరికి ఈ వర్షం ఊరటనిచ్చింది. పత్తి పంట రైతులకు సైతం కలిసొచ్చింది.

బంగాళాఖాతంలో అల్పపీడనం

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రాగల నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. వరంగల్, నాగర్‌కర్నూల్, నిర్మల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నిజామాబాద్, జోగుళాంబ-గద్వాల, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలుకురిశాయి. ఖిల్లా-వరంగల్ మండలంలో 9.67 సెం.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది.

ఎమ్మెల్యే గాంధీపై చర్యలు తథ్యం

- ఆయన అనుచరులపైనా కేసు
- రాష్ట్రంలో మావోయిస్టుల కదలికల్లేవ్
- ఉగ్రవాదుల జాడ కూడా లేదు.. ఉంటే చెప్తాం
- విలేకరుల సమావేశంలో డీజీపీ జితేందర్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై చర్యలు తీసుకుంటామని, ఆయన అనుచరులపైనా కేసులు నమోదు చేశామని డీజీపీ జితేందర్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, గాంధీ వివాదంపై స్పందిస్తూ ఇప్పటికే గాంధీ, ఆయన అనుచరులపై కేసులు నమోదు చేసినట్టు వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ జరుగుతున్నందున తెలంగాణలోకి మావోయిస్టులు వస్తే.. తమ భద్రతా దళాల నుంచి ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని, అవసరమైతే ఎన్‌కౌంటర్లకూ వెనుకాడబోమని స్పష్టంచేశారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర మినహా తెలంగాణలో మావోయిస్టుల కదలికలు లేవని చెప్పారు. హైదరాబాద్‌లో ఉగ్రవాదుల జాడ లేదని తెలిపారు. ఉగ్ర కదలికలపై నిఘా ఉంచామని, సమాచారం ఉంటే తెలియజేస్తామని చెప్పారు. వినాయక నిమజ్జనాల్లో డీజే సిస్టమ్స్ ఉపయోగించొద్దని, వాటివల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని సూచించారు. చిన్న చిన్న ఘటనలు మినహా వినాయక చవితి, నిమజ్జనాలు, మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయని చెప్పారు. మొత్తం 5,879 ప్రాంతాల్లో 1,36,638 విగ్రహాలు నిమజ్జనం చేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,400 మంది పోలీసులు, 47 ప్లాటూన్స్‌తో విధులు నిర్వర్తించినట్టు చెప్పారు.

జైనూర్ ఘటన దురదృష్టకరం

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జైనూర్ ఘటన దురదృష్టకరమని డీజీపీ అన్నారు. వెంటనే పరిస్థితిని అంచనా వేసి, 38 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. 720 మంది పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో జైనూర్ మొత్తం మోహరించామని వివరించారు. లా అండ్ ఆర్డర్ ఏడీజీ, ఐజీతో భద్రతను పర్యవేక్షించామని తెలిపారు. సివిల్ కేసుల్లో తలదూర్చిన చిక్కడపల్లి ఏసీపీపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ నిందితులకు రెడ్ కార్నర్ నోటీసులు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. దానికి చాలా ప్రాసెస్ ఉంటుందని సీబీఐ, ఇంటర్‌పోల్ సహకారంతో నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. డప్పు కొట్టకపోతే గ్రామ బహిష్కరణ చేసిన ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఆ వెలివేతకు సంబంధించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఏడీజీ మహేశ్ భగవత్, ఐజీలు సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్ ఉన్నారు.

ప్రాథమిక బడుల్లో ప్రీప్రైమరీ

- బాలవాటిక పేరుతో తరగతులు
- అధికారులను ఆదేశించిన సీఎం
- ప్రత్యేకంగా పాలసీ రూపకల్పన
- అంగన్‌వాడీల పరిస్థితి ఏంటి?

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం సర్కారు బడుల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వంటి పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించాలనుకుంటున్నది. బాలవాటిక పేరుతో తరగతులను నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు తీవ్రతరం చేశారు. రాష్ట్రంలో 18,241 ప్రాథమిక బడులున్నాయి. 3,144 ప్రాథమికోన్నత బడులను పీఎస్‌లలో విలీనం చేయనున్నారు.

ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రభావం..

ప్రస్తుతం పూర్వప్రాథమిక విద్యాబోధన అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్నది. సర్కారు బడుల్లో ఒకటో తరగతి నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రైవేట్ బడుల్లో నర్సరీ నుంచే విద్యార్థులను చేర్చుకుంటుండంతో వారు అక్కడే కొనసాగుతున్నారు. ప్రభుత్వ బడుల్లోనూ పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించడం ద్వారా నర్సరీ దశలోనే విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్ల బాట పట్టే వీలుంటుందన్న ఆలోచనలో కసరత్తు చేస్తున్నది.

అంగన్‌వాడీలుంటాయా..?

రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 6.67లక్షల మంది మూడేండ్ల నుంచి ఆరేండ్ల మధ్య వయస్కులు నమోదయ్యారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) పూర్వ ప్రాథమిక విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలని స్పష్టం చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదిశగా ముందుకెళ్తున్నది. దీంతో అంగన్‌వాడీలు ఉంటాయా..? అన్న చర్చ నడుస్తున్నది. ప్రీ ప్రైమరీ బోధనకు కొత్త టీచర్లను నియమించాలని యోచిస్తుండటంతో అంగన్‌వాడీ టీచర్ల పరిస్థితేమిటన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

- ఇస్రో చైర్మన్‌కు పుస్తక బహూకరణ

రవీంద్రభారతిలో మంగళవారం తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, లీజియన్ మళయాలీ అసోసియేషన్, హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పేస్ టూస్ పేరిట నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో నమస్తే తెలంగాణ కార్టూనిస్ట్ మృత్యుంజయ తన కార్టూన్ల పుస్తకాన్ని ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్,పర్యాటక, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావుకు అందజేశారు.

నేడు, రేపు ఓపెన్ పరీక్ష ఫీజు చెల్లించే చాన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): ఓపెన్ స్కూల్ సొసైటీ వార్షిక పరీక్షలకు హాజరయ్యేందుకు అధికారులు మరో అవకాశమిచ్చారు. బుధ, గురువారాల్లో తాత్కాల్ కింద ఫీజు చెల్లించేందుకు అవకాశమిచ్చినట్టు డైరెక్టర్ సీవీ శ్రీహరి ప్రకటనలో తెలిపారు. పదోతరగతి వారు రూ.500, ఇంటర్మీడియట్ వారు రూ.వెయ్యి ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అక్టోబర్ 3 నుంచి 9వరకు వార్షిక పరీక్షలను నిర్వహించనుండగా, ఈనెల 30న హాల్‌టికెట్లు విడుదల చేస్తామని తెలిపారు.

భూవివాదంలో రాళ్ల దాడి

- రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఘర్షణ
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో ఉద్రిక్తత

గాయపడ్డ రైతు

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 24: ఓ భూమి విషయమై రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఏర్పడిన గొడవ.. రాళ్లు, కర్రల దాడి వరకు వెళ్లింది. ఈ ఘటన మంగళవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో చోటుచేసుకుంది. పిగ్లీపూర్‌లోని సర్వే నంబర్ 17లో గోపాల్‌యాదవ్ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. పలువురు రైతులు వెంచర్‌లోకి వెళ్లి.. ఇందులో సర్కారు పట్టాలు ఇచ్చిన సీలింగ్ భూమి ఉన్నదంటూ ట్రాక్టర్‌తో పనులు చేసేందుకు యత్నించారు. దీన్ని వెంచర్ నిర్వాహకులు, సిబ్బంది అడ్డుకుంటుంటే.. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకోగా పోలీసులు చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. గాయపడ్డ రైతుల్లో పంది ముత్తయ్య, నర్సింహ, ఆకుల సత్యనారాయణ, శంకర్, మరో ఇద్దరు ఉండగా.. వెంచర్ నిర్వాహకుల్లో లోకేశ్, దర్శన్ రెడ్డి, మరొకరు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. వనస్థలిపురం ఏసీపీ, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వెంచర్ నిర్వాహకులు సంప్రదింపుల కోసం పిలిచి దాడి చేశారని, కులం పేరుతో దూషించారని రైతులు ఫిర్యాదు చేశారు. వెంచర్‌లోకి చొరబడిన కొందరు స్థానికులు.. వెంచర్ నిర్వాహకులు, సిబ్బందిపై దాడికి దిగారని ఫిర్యాదు చేశారు. పరస్పరం ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా.. పిగ్లీపూర్‌లో తమకు ప్రభుత్వం సీలింగ్ భూములిచ్చి పట్టాలు అందజేసిందని, ఆ భూముల్లోకి జరిగి కొందరు వెంచర్ చేస్తున్నారని, దీనిపై రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు. గతంలో పని చేసిన మండల రెవెన్యూ అధికారి ఇష్టానుసారంగా అనుమతులు ఇచ్చారని విమర్శించారు. వెంచర్ నిర్వాహకులు మాట్లాడుకుందామని పిలిచి, మహిళలు, పెద్ద మనుషులపై సిబ్బందితో దౌర్జన్యంగా రాళ్లు, కర్రలతో దాడిచేయించారని వాపోయారు. మరోవైపు, తమ వెంచర్‌లోని సర్వేనంబర్‌లో ఎలాంటి సీలింగ్ భూమి లేదని నిర్వాహకులు చెప్తున్నారు.



డీజీపీ ఆఫీస్ ఎదుట న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధిత కుటుంబం

న్యాయమా.. నువ్వెక్కడ!

- తమ బిడ్డ హత్యపై నిగ్గు తేల్చాలని బాధితుల డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): 'అయ్యా నా బిడ్డది రోడ్డు ప్రమాదం కాదు. ముమ్మాటికీ హత్యే. సాక్ష్యాలేవని, రోడ్డు ప్రమాదంగా తేల్చి పోలీసులు కేసు మూసేశారు. మరోసారి విచారణ చేపట్టి న్యాయం చేయండి' అంటూ కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన బాధిత కుటుంబం జోరువానలో డీజీపీ కార్యాలయం ముందు ఆర్తనాదాలు చేసింది. చొప్పదండి మున్సిపాలిటీకి చెందిన మందా విను జనవరి 22న అనుమానాస్పదంగా చనిపోయాడు. పాతకక్షల నేపథ్యంలో స్నేహితులే మేడారం జాతరకు తీసుకెళ్లి చంపేశారని తల్లి చెప్తున్నది. స్థానిక పోలీసులు డబ్బు తీసుకొని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి కేసు కొట్టివేశారని ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై జూలైలో డీజీపీ ఆఫీసులో మొర పెట్టుకోగా.. డబ్బు తీసుకున్న డీఎస్పీ, ఎస్సైకే మళ్లీ విచారణ బాధ్యతలు అప్పగించారని, దీంతో తమకు న్యాయం జరగలేదని ఆవేదనను వెళ్లగక్కారు. నిందితుల్లో కొందరికి కాంగ్రెస్ నాయకుల అండదండలు ఉండటం వల్లే తమకు అన్యాయం చేస్తున్నారని బోరున విలపిస్తూ చెప్పారు. ఈ కేసును రీఓపెన్ చేయించి, ఇంటెలిజెన్స్ పోలీసులతో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి తమ గోడు విన్నవించుకున్నారు.

'మా బతుకులు రోడ్డున పడేయద్దు'

అధికారులు ఇచ్చిన నోటీసులతో నిరసన వ్యక్తం చేస్తున్న చిరు వ్యాపారులు

భీమారం, సెప్టెంబర్ 24 : 'మా చిరు వ్యాపారుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని కలెక్టర్ కుమార్ దీపక్ మమ్మల్ని ఆదుకోవాలి' అని భీమారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఉన్న చిరు వ్యాపారులు అధికారులు అందించిన నోటీసులతో నిరసన తెలిపారు. ఊర చెరువును ఆక్రమించారని 50 మంది చిరు వ్యాపారులకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సోమవారం నోటీసులు జారీ చేశారు. చిరు వ్యాపారులు మంగళవారం తమ షాపుల వద్ద నోటీసులతో నిరసన తెలిపి మాట్లాడారు. 20 సంవత్సరాలుగా రోడ్డు మీద చిన్న టేలాలు పెట్టుకొని చిరు వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్నామన్నారు. ఆ టేలాలు బఫర్ జోన్‌లో ఉన్నాయని అధికారులు నోటీసులు జారీ చేశారని వాపోయారు. కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయలని కోరారు.

జేకే పేపర్ మిల్లు ఎదుట ఆందోళన

పేపర్ మిల్లు ఎదుట ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 24:కాగజ్‌నగర్ పట్టణంలోని జేకే పేపర్ మిల్లు ఎదుట ఆయా కాలనీ వాసులు మంగళవారం ధర్నా చేశారు. పేపర్ మిల్లు నుంచి వచ్చే కాలుష్యం, పొగతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తలెత్తుతున్నాయని పట్టణంలోని సర్దార్ బస్తీ, సంఘం బస్తీతో పాటు తదితర కాలనీ వాసులు ఆందోళన నిర్వహించారు. పొగ కారణంగా వృద్ధులు, చిన్న పిల్లలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. పొగ విడుదల కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పేపర్ ప్రతినిధి రమేశ్ రావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు ఖయ్యూం, మాజిద, సాయి, సాంబయ్య, లక్ష్మి, జీజాబాయి, సాజిదా, సమీరా తదితరులున్నారు.

ఎమ్మెల్యే బెదిరింపు రాజకీయాలు మానుకోవాలి

మంచిర్యాల (ఏసీసీ), సెప్టెంబర్ 24: స్థానిక ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు బెదిరింపు రాజకీయాలు మానుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ హితవు పలికారు. ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలు మానుకోకపోతే డీజీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. మంగళవారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బెదిరింపులపై సీఎం రేవంత్ రెడ్డి, పోలీసు ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలన్నారు. కాంగ్రెస్‌లో భూ కబ్జాదారులే .. భూ ఆక్రమణలపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లాకేంద్రంలో భూ దందా, సెటిల్మెంట్లు చేస్తున్నది ఎవరో అందరికీ తెలుసని చురకలు అంటించారు. హైదరాబాద్‌లోని కాప్రాలో పేదల భూములను కబ్జా చేశారనే ఆరోపణలపై ప్రేంసాగర్ రావు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజధానిలో చెరువుల్లో, బఫర్ జోన్లో ఇళ్లు కట్టింది నిజం కాదా అని ప్రశ్నించారు. జిల్లాలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో భూ ఆక్రమణలు చేసిన వారి జాబితాను సీఎం తెప్పించుకుని, అందులో మొదటగా కాంగ్రెస్ వారి ఇళ్లను కూలగొట్టాలని సవాల్ విసిరారు. ఇతర పార్టీల్లోని అక్రమార్కులు.. కాంగ్రెస్ పార్టీలో చేరగానే నీతిమంతులయ్యారా..? అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నాం కదా అని, ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టి, భయభ్రాంతులకు గురి చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి పురుషోత్తం, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, మోటపలుకుల తిరుపతి, గాదె శ్రీనివాస్, కర్రె లచ్చన్న తదితరులున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

కాసిపేట, సెప్టెంబర్ 24 : వర్షా కాలం కావడంతో జ్వరాలు అధికంగా ఉంటాయని, వైద్య సేవలకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం కాసిపేట మండలంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వైద్య సేవల కోసం అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన వారికి మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యాధికారికి ఆదేశించారు. గ్రామ్‌పల్లిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, డివిజనల్ పంచాయతీ అధికారి షేక్ సఫ్దర్ అలీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠాలు బోధించిన కలెక్టర్..

కలెక్టర్ కుమార్ దీపక్ అధికార హోదాను కాసేపు పక్కన పెట్టి టీచర్‌గా మారిపోయారు. తగరతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెప్పి ఆకట్టుకున్నారు. టీచర్లలో ఉత్తేజం నింపారు. అనంతరం సోనాపూర్, నాయకపుగూడ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. అనంతరం ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, డీఎల్‌పీవో సఫ్దర్ అలీ, ఉపాధ్యాయులున్నారు.

విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

డివిజనల్ లెవెల్ గేమ్స్ ప్రారంభం

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 24: హైదరాబాద్ గిరిజన సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ డివిజనల్ స్థాయి గేమ్స్ జిల్లా కేంద్రంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఏటీడీవో చిరంజీవి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆశ్రమ క్రీడా పాఠశాలలో ప్రారంభమైన ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్ రమాదేవి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్దవ్, జీసీడీవో శకుంతల, క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు, వ్యాయామ ఉపాధ్యాయులు మధుసూదన్, కృష్ణమూర్తి, గుండం లక్ష్మణ్, మంగావతి, కోచ్ విద్యాసాగర్, అరవింద్ , తదితరులు పాల్గొన్నారు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రమాదేవి

బీఆర్ఎస్ నేత ఇంటి వద్ద పోలీసుల హడావుడి

బేర సత్యనారాయణ ఇంటి వద్ద పోలీసులు, మున్సిపల్ సిబ్బంది

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 24: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కౌన్సిలర్ బేర సత్యనారాయణ ఇంటి వద్ద పోలీసుల హడావుడి కనిపించింది. నస్పూర్ గేట్ సమీపంలో ఉన్న ఆయన ఇంటికి మంగళవారం మున్సిపల్ అధికారులు, పోలీసులు చేరుకున్నారు. ఆయన ఇంటి ఎదుట రోడ్డు కోసం పోసిన మట్టిని తొలగించేందుకు ప్రయత్నించారు. ఆ స్థలంలో కార్లు ఉండడంతో మట్టి తీయడం సాధ్యకాకపోవడంతో మున్సిపల్ అధికారులు, పోలీసులు వెనుదిరిగారు. బేర సత్యనారాయణ ఇంటి ముందున్న ఉన్న సిమెంట్ రోడ్డు ఎత్తు భాగంలో ఉండడంతో వర్షపు నీరు తమ ఇళ్లలోకి వస్తున్నదని, ఆ రోడ్డును తొలగించాలని స్థానికులు మున్సిపాలిటీలో ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఇంటి ఎదుట మున్సిపాలిటీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఈనెల 19న పోలీస్ బందోబస్తు మధ్య తొలగించారు. నస్పూర్‌కు వేళ్లే ప్రధాన మార్గం నుంచి ఆయన ఇంటి వరకు వెళ్లడానికి మట్టిపోశారు. ఈ మట్టిని కూడా అదే రోజు తరలించేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ సాధ్యం కాలేదు. మంగళవారం మట్టిని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు వచ్చారు. దీంతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మట్టి రోడ్డుపై కార్లు ఉండడంతో మట్టిని తీయడం సాధ్యం కాలేదు. బేర సత్యనారాయణ భార్య, కూతురు అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తాము కొన్న భూమిలో మట్టి పోసుకుంటే తొలగించడమేమిటని ప్రశ్నించారు.

రామగుండం కమిషనరేట్‌లో పరిధిలో పోలీస్ స్టేషన్లకు గుర్తింపు

ఫర్టిలైజర్‌సిటీ / బెల్లంపల్లి, సెప్టెంబర్ 24: ఉత్తమ సేవల్లో రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని మూడు పోలీస్టేషన్లకు ఉత్తమ గుర్తింపుగా రెండు కేటగిరిలో మూడు స్థానాలు లభించాయి. రాష్ట్ర వ్యాప్తంగా పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టిమ్‌లో ఉత్తమ సేవల్లో ఐదు పోలీస్టేషన్లను ఎంపిక చేయగా గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్టేషన్ నాల్గో స్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా సత్వర సేవలు అందించిన 10 పోలీస్టేషన్‌ల ఎంపికలో బెల్లంపల్లి వన్‌టౌన్‌కు మూడోస్థానం, ధర్మారం పోలీస్టేషన్‌కు ఐదోస్థానంలో నిలిచింది. గోదావరిఖని వన్‌టౌన్‌లో రిసెప్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో ప్రవర్తించిన మర్యాద, సమస్యపై స్పందించి పరిష్కారానికి భరోసా కల్పించి పిటిషన్‌లో ఆన్‌లైన్‌లో నమోదుచేసి ఉత్తమ సేవలు అందించగా, ప్రజలకు సత్వర సేవలు అందించడంలో మంచిర్యాల్ జోన్ బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐ దేవయ్య, పెద్దపల్లి జోన్ ధర్మారం ఎస్ఐ లక్ష్మణ్‌లు పోలీస్టేషన్‌లకు వచ్చిన బాధితులతో సమస్యలను విని చట్టపరిధిలో పరిష్కారించి బాధితులకు నమ్మకం కలిగించి సత్వర సేవలు అందించడంపై ఉత్తమ సేవల్లో స్థానం పొందినట్లు రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ తెలిపారు. వీరిని సీపీ అభినందించారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

కౌటాల, సెప్టెంబర్ 24 : బాలికలు, విద్యార్థినులు మహిళలను వేధించినా, లైంగిక దాడులు పాల్పడినా చట్టరీత్యా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చింతలమానేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై ఈ నెల 22న అదే గ్రామానికి చెందిన 27 ఏళ్ల యువకుడు లైంగిక దాడి చేశాడని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై పోక్సో కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఆయన వెంట కౌటాల సీఐ ముత్తే రమేశ్ , కౌటాల, చింతలమానేపల్లి ఎస్ఐలు మధుకర్, నరేశ్ ఉన్నారు.. .

ఐదుగురిపై కేసు..ముగ్గురి రిమాండ్

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 24: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేయగా ముగ్గురిని రిమాండ్ చేసినట్లు పట్టణ సీఐ శంకరయ్య మంగళవారం తెలిపారు. పట్టణానికి చెందిన రీమా యాదవ్ వ్యక్తి గత వీడియోలు వైరల్ అవుతున్న విషయం తెలుసుకొని ఆ వీడియోలు డిలీట్ చేయాలని అడిగేందుకు పట్టణంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలోని వైన్స్‌లో పని చేస్తున్న వ్యక్తి వద్దకు వెళ్లిన క్రమంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగినప్పుడు రీమా యాదవ్‌పై దాడి చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.పురుషోత్తం, శివగౌడ్, నవీన్ గౌడ్, భరత్, అవినాశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వ్యక్తిగత వీడియోలో వైరల్ చేసిన విషయంలో రెండు రోజుల క్రితం కేసు నమోదు చేసిన శైలజ, ఈశ్వర్‌తో పాటు తుడూరు శివకుమార్‌ను మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ డీఎస్పీ రాజనజం మాట్లాడుతూ మహిళల వ్యక్తిగత వీడియోలు వైరల్ చేయడం నేరమన్నారు.

శ్రీవారి లడ్డూలో కల్తీకి పాల్పడిన వారిని శిక్షించాలి

మందమర్రి రూరల్, సెప్టెంబర్ 24: హిందువులు మహాప్రసాదంగా భావించే శ్రీవారి లడ్డ